
సాక్షి బాపట్ల

మంగళవారం । 19 । మార్చి । 2024



ఆదిలక్ష్మీనారాయణుల కల్యాణం

పాత గుంటూరు: అరండల్‌పేటలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కల్యాణం కనులపండువగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం 513.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



జైలులో ఓపెన్ టెన్త్ పరీక్షలు

పట్నంబజారు: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జిల్లా జైలులో సోమవారం నిర్వహించినట్లు గుంటూరు జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి కె.రఘు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
గుంటూరు	6.24	4.55
నరసరావుపేట	6.26	4.58
బాపట్ల	6.24	4.56

న్యూస్‌రీల్

నేడు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులకు గ్రీవెన్స్

నరసరావుపేట: స్థానిక పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వేతనాలకు సంబంధించిన సమస్యలు ఉన్న వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని వ్యక్తిగతంగా కలసి వినతిపత్రాన్ని అందజేయాలని సూచించారు. జిల్లాలో వచ్చిన వినతులన్నింటిని సమీకరించి విజయవాడలోని ప్రజారోగ్య డైరెక్టర్‌కు అందజేయనున్నట్లు వివరించారు. వేతన సమస్యలపై వినతులు సమర్పించేందుకు ఉద్యోగులు, ఉద్యోగసంఘాల ప్రతినిధులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు.

మిర్చి రైతులు తక్‌పట్టి తీసుకెళ్లాలి

కొరిటిపాడు(గుంటూరు): ఎన్నికల నిబంధనలు దృష్ట్యా మిర్చి రైతులు నగదు తీసుకెళ్లే సమయంలో తక్‌పట్టి తీసుకెళ్లాలని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు, గుంటూరు మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధారం లేకుండా అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లడం ఉల్లంఘన కిందకు వస్తోందని హెచ్చరించారు. మిర్చి విక్రయించిన రైతులు కమీషన్ వ్యాపారి వద్ద నుంచి తప్పనిసరిగా తక్‌పట్టిని పొందాలని సూచించారు.

యార్డులో 1,35,164 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,35,164 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,28,403 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.19,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 84,046 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తులు

నరసరావుపేట ఈస్ట్: వేసవి సెలవులలో చిన్నారులలో క్రీడాసక్తిని పెంపొందించేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మే నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని వివరించారు. శిబిరంలో 8 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసు ఉన్న బాలబాలికలకు వివిధ క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శిబిరంలోనూ 25 మంది బాలికలు, 25 మంది బాలురుతో ఏర్పాటు చేసిన శిబిరంలో నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న క్రీడా అసోసియేషన్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు తమ వివరాలను ఈనెల 26వ తేదీలోగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, అధికారికి తెలియజేయాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులు తమ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ వద్ద నుంచి ధ్రువ పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు. వివరాలకు 8212622574 లో సంప్రదించాలని కోరారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5500, మోడల్ ధర రూ.4700 వరకు పలికింది.

వార్ ట్రయల్ రన్ వే









కదన రంగంలో గగనం నుంచే భీకరదాడులు చేసి శత్రువులను గడగడలాడించే విమానాలు హైవేపై పరుగులు తీశాయి. సోమవారం బాపట్ల జిల్లా కొరిశపాడు సమీపంలోని పి.గుడిపాడు వద్ద ఎమర్జెన్సీ ల్యాండ్ అయ్యాయి. అత్యవసర సేవలతో పాటు, సైనిక అవసరాలకు ఉపయోగపడేలా పి.గుడిపాడు, సింగరాయకొండ సమీపంలో ప్రత్యేక రన్‌వేలు నిర్మించారు. గతంలో దిగకుండా విమానాలతో ట్రయల్ రన్ నిర్వహించగా, నేడు రన్‌వేపై విమానాలు దించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఎయిర్ ఫోర్స్ అధికారులు, ఉదయం నుంచే కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు పెద్దఎత్తున భద్రతా చర్యలు చేపట్టారు. భారత వాయుసేనకు చెందిన సుఖోయ్ 30, జెట్ ఫైటర్ హాక్ కార్గో విమానాలు ఏఎన్ 32, డోర్నియర్ విమానాలు ఇలా.. ఉదయం మధ్యాహ్నం ఒంటిగంట వరకు రహదారిపై దిగి సందడి చేశాయి. రాడార్ వాహనంతో పాటు అత్యాధునిక సాంకేతిక వాహనాలను రన్‌వే సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆశ్రమంలో ఉంచారు. ట్రయల్ రన్ సందర్భంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను దారి మళ్లించారు.

– ఎం.ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు



టీడీపీ కోడ్ ఉల్లంఘన!

- అనుమతి లేని వాహనంలో ప్రచారం
- ప్రత్తిపాడులో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఫ్లెక్సీలతో ఆటోలు
- పట్టించుకోని అధికారులు

టీడీపీ కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతోంది. అనుమతి లేకుండా ప్రచార వాహనాలు తిప్పుతున్నారు. ఫ్లెక్సీలు తొలగించడం లేదు. అన్ని ప్రాంతాల్లో తొలగిస్తున్నా ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాలలో అమలు కావడం లేదు.

ప్రత్తిపాడు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచార రథాలు రోడ్లపై రయ్ రయ్ అంటూ ఊరేగుతున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తరువాత కచ్చితంగా ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారానికి వినియోగించుకునే వాహనాలతో పాటు మైకు పర్మిషన్లను సంబంధిత రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాలి. ఆ తరువాతనే ప్రచారానికి ఆయా వాహనాలకు వినియోగించాల్సి ఉంటుంది. ఈ విషయమంపై సమగ్రంగా అవగాహన ఉన్న మాజీ కలెక్టర్, టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు మాత్రం రూల్స్‌ను డోంట్ కేర్ అంటున్నారు. తన ఫొటోతో పాటు ఎంపీ అభ్యర్థి ఫొటోల ఫ్లెక్సీలు ఉన్న ఆటోలకు మైకులు ఏర్పాటు చేసుకుని ఎన్నికల ప్రచారానికి అనుమతులు తీసుకోకుండా వాహనాలను తిప్పేస్తున్నారు. కానీ సంబంధిత అధికారులు మాత్రం వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. కోడ్ ఉల్లంఘన బహిరంగంగా జరుగుతున్నా నియంత్రించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సాధారణంగా జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికార యంత్రాంగం తొలగించే ఏర్పాట్లు చేసింది. అదే విధంగా వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు తెల్ల వస్త్రం ఏర్పాటు చేశారు.



ప్రత్తిపాడులో అనుమతి లేకుండా మైకులతో, టీడీపీ ఫ్లెక్సీలతో ప్రచారం నిర్వహిస్తున్న ఆటో



తెనాలి రోడ్డులో వడ్లమూడి వద్ద తొలగించకుండా ఉన్న మాజీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్ భారీ ఫ్లెక్సీ

వడ్లమూడి– తెనాలి రోడ్డులో ఫ్లెక్సీలు

చేబ్రోలు: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో తెలుగుదేశం పార్టీకి చెందిన కొన్ని ఫ్లెక్సీలను సోమవారం రాత్రి వరకు తొలగించలేదు. వడ్లమూడి గ్రామ పరిధిలోని తెనాలి రోడ్డులో క్వారీ దేవస్థానం, సంగం డెయిరీ పశువుల దాణా ప్రాంతాల వద్ద టీడీపీ మాజీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు చెందిన భారీ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి.

నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి ప్రాంతంలో టీడీపీ ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంగం డెయిరీ ప్రాంతంలోనూ ఫ్లెక్సీలు తొలగించలేదు. వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీలు కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే తొలగించిన అధికారులు, టీడీపీ ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు తొలగించకపోవటంపై పలువురు విమర్శిస్తున్నారు.

టీడీపీ వాహనాలకు అనుమతుల్లేవు

టీడీపీ ఎన్నికల ప్రచారానికి వినియోగిస్తున్న వాహనాలకు ఇప్పటి వరకు అనుమతులు లేవు. అనుమతుల కోసం సంప్రదించారు. అనుమతులు ఇచ్చే వరకు వాహనాలను తిప్పవద్దని చెప్పాం. మొదటిసారిగా ఒకసారి హెచ్చరిస్తాం. అయినా అనుమతి లేకుండా వాహనాలను తిప్పి ప్రచారం చేపడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– పి.శ్రీకర్,
ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ప్రత్తిపాడు

బఫే పద్ధతిలో దుర్గమ్మ అన్నప్రసాదం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసే భక్తులందరికీ అమ్మవారి అన్న ప్రసాదం అందేలా దేవస్థాన అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దర్శనం అనంతరం అన్న ప్రసాద వితరణ ప్రాంగణానికి విచ్చేసిన భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండకుండా నేరుగా ప్రసాద వితరణ హాల్‌లోకి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి నిత్యం అమ్మ వారి దర్శనానికి సుమారు 30 వేల నుంచి 40 వేల మంది భక్తులు విచ్చేస్తుంటారు. వీరిలో అత్యధిక మంది సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే వారే. సాధారణ రోజులలో నాలుగు వేల మందికి, శుక్ర, శని, ఆదివారాలలో రోజుకు ఐదు వేల మందికి అన్న ప్రసాదం పంపిణీ జరుగుతుంది.

మొదటి అంతస్తులో బఫే

మహా మండపం మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో అన్న ప్రసాదం పంపిణీ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన రావడంతో పాటు దాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు. దీంతో మహా మండపం మొదటి అంతస్తులో భక్తులకు అన్న ప్రసాదాన్ని బఫే పద్ధతిలో వడ్డించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బీసీలకు టీడీపీ తీవ్ర అన్యాయం

- సామాజిక న్యాయం మాటల్లోనే... చేతల్లో లేదు
- 50శాతం ఉన్నా ఓటు బ్యాంకుగానే చూస్తున్న టీడీపీ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో యాదవులకు సీటు కేటాయించాలి
- మంగళగిరిలో లోకేష్ వెనక్కి తగ్గి యాదవులకు అవకాశం కల్పించాలి
- టీడీపీలో డబ్బు సంచులు తెచ్చే వారికి సీట్లు కేటాయింపు
- శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆలా వెంకటేశ్వర్లు



ప్లకార్డు ప్రదర్శిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

నెహ్రూనగర్: తెలుగుదేశం పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క బీసీకైనా సీటు కేటాయించలేదని శ్రీకృష్ణ యాదవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. 1983 టీడీపీ ఆవిర్భావం నుంచి 40 ఏళ్లలో ఇప్పటి వరకు 180 మంది ఎమ్మెల్యేలు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎన్నికయ్యారు. వారిలో యాదవ, వడ్డెర, రజక, పద్మశాలి వంటి ఇతర బీసీలకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా లేకపోవడం బాధాకరమన్నారు. పదేళ్ల నుంచి తెనాలి, పొన్నూరు నియోజకవర్గాలకు ఒకే కులానికి, ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకే సీట్లు కేటాయిస్తున్నారు. సింగపూర్ తరహాలో రాజధాని నిర్మిస్తాం.. సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకుందాం అని చెప్పే చంద్రబాబుకు ఆ దేశంలో సామాజిక న్యాయం పాటిస్తున్న విషయం తెలియదా ? అని ప్రశ్నించారు. అక్కడి ప్రభుత్వం సామాజిక సమతుల్యత కల్పిస్తారు.. అక్కడ ఏ విధంగా సోషల్ జస్టిస్ అమలు చేస్తున్నారో...ఇక్కడ సీట్ల కేటాయింపులో కూడా సోషల్ జస్టిస్ కల్పించాలని డిమాండ్ చేశారు.

లోకేష్ వెనక్కి తగ్గాలి..


అమెరికాలో చదువుకున్న లోకేష్‌కి సామాజిక న్యాయం పాటించాలని తెలియదా? వైఎస్సార్ సీపీ సామాజిక న్యాయం పాటిస్తూ మంగళగిరిలో బీసీలు ఎక్కువగా ఉంటారని బీసీ మహిళకు సీటు కేటాయిస్తే అక్కడ నువ్వు ఏవిధంగా పోటీ చేస్తావని లోకేష్‌ను ప్రశ్నించారు. అక్కడ వైఎస్సార్ సీపీ బీసీలకు సీటు కేటాయించింది కాబట్టి బీసీ యాదవులకు సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుంటూరులో ఎంతో కాలం పార్టీ కోసం కష్టపడిన నాయకులు పేదల డాక్టర్‌గా పేరొందిన డాక్టర్ నిమ్మల శేషయ్య మీకు కనిపించలేదా ? అని ప్రశ్నించారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో యాదవులకు ఒక్క సీటైనా కేటాయించాలని లేని పక్షంలో కురుక్షేత్రమే అన్నారు. గెలుపు గుర్రాలకు కళ్లెం వేసి తగిన బుద్ధి చెప్పేందుకు బీసీలంతా ఏకమవుతామన్నారు.

యాదవులు ప్రాణ త్యాగాలు చేయాలా?

లోకేష్ పాదయాత్ర చేసే సమయంలో ఎవరిపై ఎన్ని కేసులుంటే వారికి నామినేటెడ్ పోస్టులు, పదవులు ఇస్తామన్నారు. లోకేష్ వ్యాఖ్యలకు పల్నాడులో యాదవులు ఇద్దరు పార్టీ కోసం పని చేసి హత్యకు గురయ్యారు. ఇప్పుడు సీట్లు కేటాయించిన వారిలో ఎవరిపై ఎన్ని కేసులు ఉన్నాయని కేటాయించారని ప్రశ్నించారు. మీ పల్లకీలు మోసేందుకు యాదవులు కావాలి. మీకు మాత్రం వారు కనిపించడం లేదా ? అని నిలదీశారు. సమావేశంలో యాదవ సంఘ నాయకులు తోట కోటేశ్వరరావు, దాసరి శివకుమార్, ఉగ్గం సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

- జిల్లాలో 108 కేంద్రాల్లో నిర్వహణ
- 17,436 మంది విద్యార్థులకు 16,806 మంది హాజరు
- కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా



విద్యార్థులతో కిటకిటలాడుతున్న పరీక్ష కేంద్రాలు

బాపట్ల టౌన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. గంట ముందుగానే విద్యార్థులు ఆయా పాఠశాలల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా డీఈవో కె. నారాయణరావు ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద హెల్త్ సూపర్‌వైజర్ల నియామకంతో పాటు తాగునీటి సౌకర్యం, తరగతి గదిలో వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రారంభం నుంచి పరీక్ష ముగిసే వరకు తనిఖీ బృందాలు ప్రత్యేక నిఘా ఉంచాయి.

630 మంది విద్యార్థులు గైర్హాజరు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 108 సెంటర్లు ఉండగా వాటిల్లో తొలిరోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 17,436 మంది విద్యార్థులకు గానూ 16,806 మంది మాత్రమే హాజరయ్యారు. 630 మంది గైర్హాజరు అయ్యారు.


అధికారుల విస్తృత తనిఖీలు

పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైనప్పటి నుంచి నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు ముగిసేంత వరకు స్క్వాడ్ బృందాలు వెన్నంటి ఉన్నాయి. జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌కు చేరుకొని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల టెక్స్ బుక్స్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు రవీంద్రనాథ్‌రెడ్డి జిల్లాలోని ఐదు సెంటర్లలో, జిల్లా విద్యాశాఖాధికారి కె. నారాయణరావు జిల్లాలోని నాలుగు సెంటర్లలో తనిఖీలు చేశారు. వీరితోపాటు డెప్యూటీ డీఈవోలు ఒక్కొక్కరు నాలుగు సెంటర్ల చొప్పున తనిఖీ చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో నియమించిన సిట్టింగ్, ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా

జిల్లాలో పరీక్షలు జరిగే 108 పరీక్ష కేంద్రాల వద్ద ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. కేంద్రాలకు సమీపంలో ఫొటో స్టాట్, నెట్ సెంటర్లు లేకుండా చూశారు. పరీక్షలు ప్రారంభమైనప్పటికీ నుంచి ముగిసేంత వరకు 144 సెక్షన్‌ను అమలు పరిచారు.

హనుమంత వాహనంపై శ్రీవారి దర్శనం



మంగళగిరి: పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అభయ ప్రదాత అయిన హనుమంతుని భుజ స్కంధాలపై శ్రీ లక్ష్మీ నారసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించగా దుగ్గిరాల మండలం పెదపాలేనికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు(రాజేష్) కైంకర్యపరులుగా వ్యవహరించారు.

ఆంధ్రా అమ్మాయి... జవహర్‌నగర్ మేయర్

- జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ముత్తాయపాలెం మహిళ
- ఆనందంలో గ్రామస్తులు



శాంతి

బాపట్ల టౌన్: బాపట్ల మండలం, ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పమిడిబోయిన శాంతి తెలంగాణ రాష్ట్రంలోని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎంపికయ్యారు. ఆమె బాపట్ల మండలం, ముత్తాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్య అభ్యసించారు. 2000లో తెనాలి మండలం, దావులూరిపాలెం గ్రామానికి చెందిన కోటేష్‌గౌడ్‌తో వివాహమైంది. గడిచిన 20 సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 18వ డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ పార్టీ కార్పొరేటర్లంతా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో ముత్తాయపాలెం గ్రామానికి చెందిన మహిళ శాంతి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లో మీడియాపై వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం

ఆంధ్రజ్యోతి ప్రతుల దహనం

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చినహనిమిరెడ్డి భయపడిపోయే వ్యక్తి కాదని అద్దంకి మండల కన్వీనర్ పానెం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'హనిమిరెడ్డి ఎక్కడ' అనే శీర్షికతో వార్త వెలువడింది. దీనిని ఖండిస్తూ స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్తగా హనిమిరెడ్డిని నియమించినప్పటి నుంచి మూడు నెలలుగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. హనిమిరెడ్డిపై ఇలాంటి రాతలు రాయడం ఎల్లో మీడియాకు తగదని హితవు పలికారు. అద్దంకిలో హనిమిరెడ్డి గెలుపు ఖాయమని తెలుసుకున్న టీడీపీ నాయకులు ఎల్లో



ఆంధ్రజ్యోతి ప్రతులను దహనంచేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. తాము ఎప్పటికీ అద్దంకి విడిచిపెట్టేలేదని తెలిపారు. అద్దంకి అభ్యర్థిగా హనిమిరెడ్డిని సీఎం జగన్ ప్రకటించటంతో పచ్చ పార్టీ నాయకులకు నిద్రపట్టటం లేదన్నారు. అసత్య వార్తలు ఎన్ని రాసుకున్నా అద్దంకిలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానేనని ధీమా వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతిని బహిష్కరించాలి

శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ జువ్వి రాము మాట్లాడుతూ పనిగట్టుకుని హనిమిరెడ్డిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం రాబోయే ఎన్నికల తరువాత తమ నాయకుడు గొట్టిపాటి ఎక్కడ? అని రాసుకోవాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. అద్దంకి సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విలేకర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన మనసున్న వ్యక్తి హనిమిరెడ్డి అన్నారు. మండల యూత్ నాయకుడు అవిశెన ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ హనిమిరెడ్డి భారీ మెజార్టీతో గెలువటం ఖాయమని భావించిన టీడీపీ నాయకులు అనుకూల మీడియాతో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని ధ్వజమెత్తారు. విలువలు లేని రాతలు రాస్తున్నా ఆంధ్రజ్యోతిని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు హేయం

అద్దంకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి

బల్లికురవ: ఎల్లో మీడియాలో తనపై వచ్చిన వార్తలు హేయమని అద్దంకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్లికురవ వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన్ను సోమవారం కలసి టికెట్ ఇచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ తాను, కుటుంబ సభ్యులు గత మూడు నెలలుగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటుంటే ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేసిందని ధ్వజమెత్తారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు టికెట్ ప్రకటించగానే మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సభ్యులతో దేవాలయాలకు వెళ్లానన్నారు. తాను జీవితాంతం అద్దంకి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని, ఓటుతో ఆశీర్వదించాలని ప్రజలను ఆయన కోరారు. ఎన్నికల నేపథ్యంలో అసత్య ప్రచారాలు చేస్తుంటారని, వాటిని నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను మండలంలోని వివిధ గ్రామాల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ విజయానికి, అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, సురభి ప్రభాకర్, పందిరి ఏసోబు, మరియబాబు, సేక్ మహమ్మద్ వలి, మందా ప్రభాకర్, బొంతు మోహన్, బండి గంగాప్రసాద్, ప్రత్తిపాటి కిరణ్‌కుమార్, కందుకూరి పేతురు ఉన్నారు.



హనిమిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బల్లికురవ నాయకులు

పొత్తులతో ప్రజలకు ఒరిగేది శూన్యం



పార్టీలోకి చేరిన పూనూరు గ్రామస్తులతో బాలాజీ



గ్రామంలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాలాజీ

- ఆదరించండి అండగా ఉంటా!
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ

మార్టూరు: మూడు పార్టీల పొత్తులతో ప్రజలకు ఒరిగేది శూన్యమని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ ఎద్దేశా చేశారు. మండలంలోని వలపర్ల గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం చిలుకలూరిపేట వద్ద నిర్వహించిన మూడు పార్టీల కూటమి సభలో నాయకులు తమను వచ్చే ఎన్నికల్లో ఇన్ని సీట్లు ఇచ్చి గెలిపించండి అని అడగడం తప్పా గెలిపిస్తే ప్రజలకు ఏం చేస్తారో చెప్పలేకపోయారని బాలాజీ విమర్శించారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు జరిపిన సంక్షేమ పథకాల్ని తాము గెలిస్తే ప్రజలకు అందించగలమనే దమ్మూ, ధైర్యం ఏ నాయకుడికీ లేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికలలో ఇవే మూడు పార్టీల కూటమి ప్రజలకు ఇచ్చిన హామీల్ని అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కిన విషయం ప్రజలు ఇంకా మరిచి పోలేదని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అర్ధరాత్రి అర్థంతరంగా విభజించిన వేళ ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తానన్న ప్రత్యేక హోదా హామీ ఏమైందనే విషయం నిన్నటి సభలో ఏ ఒక్క నాయకుడు మాట్లాడకపోవడం వారి అవకాశవాద రాజకీయాలకు పరాకాష్టని ఆయన విమర్శించారు. విభజన చట్టంలోని హామీలు, పోలవరం ప్రాజెక్టు నిధుల గురించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎందుకు మాట్లాడలేకపోయారో ప్రజలు ఆలోచించాలని ఆయన సూచించారు. గత ఐదేళ్లలో ప్రస్తుత ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లను పలు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసిందని తెలిపారు. ఇదే పథకాలను ప్రజలు తమకు అధికారం అప్పగిస్తే అమలు పరుస్తామనే ధైర్యం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ఉందా ? అని బాలాజీ సూటిగా ప్రశ్నించారు. మరోసారి సీఎంగా వైఎస్. జగన్ మోహన్‌రెడ్డిని, తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరిస్తే ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు.

మరోమారు అధికారంలోకి వైఎస్సార్ సీపీ

ప్రజల ఆశీర్వాదబలం, పారదర్శక పాలనతోనే మరోమారు రాష్ట్రంలో అధికారం చేపట్టబోతున్నామని యడం బాలాజీ ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలతోనే మరోమారు ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అడగబోతున్నట్లు ఆయన అన్నారు. త్వరలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించనున్నానని, నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. సమష్టి కృషి, ఐక్యంగా పోరాడడం ద్వారా నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మూకిరి ప్రసాద్ భార్య సుభాషిణి (35) సోమవారం ఉదయం పాము కాటుకి గురై మృతి చెందడంతో ఆమె భౌతికకాయం వద్ద బాలాజీ నివాళులర్పించి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల, వలపర్ల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరిక

వైఎస్సార్ సీపీ పార్టీలో ఉన్న ప్రతి నాయకుడికీ, కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ తెలిపారు. పర్చూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం పూనూరు గ్రామంలోని టీడీపీకి చెందిన 50 కుటుంబాలు సర్పంచ్ మేకా సుధాకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వారికి బాలాజీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తన్నీరు వెంకట్రావు, కుంచపు ఆంజనేయులు, అచ్చి మూర్తయ్య, కుంచపు సుబ్బారావు, తిరుపతి వీరయ్య, పత్తిపాటి చిన్నా, వెంకటేశ్వర్లు, గుడిపాటి కల్యాణ్, దన్నవరపు వీరాంజనేయులు ఉన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

బాపట్ల టౌన్: రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాపట్ల స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... విజయవాడకు చెందిన షేక్ సమ్మర్ (45) కాంట్రాక్ట్ పద్ధతిలో పూరి- తిరుపతి రైలులో మొబైల్ క్యాటరింగ్‌లో పనిచేస్తూ ఉంటారు. తెనాలి నుంచి ఒంగోలు వెళుతున్న సమయంలో రైలు కిందపడి మృతి చెందాడు. పూరి నుంచి తిరుపతి వెళుతున్న రైలు బాపట్ల రైల్వే స్టేషన్‌లో ఎక్కువ సమయం ఆగేసరికి పక్కనే ఉన్న బహిరంగ ప్రదేశంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లినట్లు తెలిసింది. రైలు కదిలే సమయంలో షేక్ సమ్మర్ ఎక్కుతుండగా కాలు జారి ట్రైన్ కింద పడి మృతి చెందాడు. ఈ ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరేశ్వరుని సన్నిధిలో 'అమరేశ్వరం' గ్రంథావిష్కరణ

అమరావతి: అమరేశ్వరాలయంపై భక్తుల హృదయాలలో కలిగే అనుమానాస్పద భావనలకు 'అమరేశ్వరం' గ్రంథం సంపూర్ణ సమాధానంగా నిలుస్తుందని అమరేశ్వరాలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మ అన్నారు. సోమవారం రాత్రి అమరేశ్వరాలయంలో పాపయారాధ్య సాహితీ కేంద్రం ఆధ్వర్యంలో ధాన్యకటక విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు రచించిన 'అమరేశ్వరం' పరిశోధనాత్మక గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జ్యోతిష్య విశారద శనగవరపు రామ్మోహనశర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపీనాథశర్మ మాట్లాడుతూ అమరేశ్వరాలయ నిర్మాణ శైలిని, ఆనాటి ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలను పరిశోధన చేసి నేటి తరాలకు అందించే ప్రయత్నం చేసిన గ్రంథకర్త డాక్టర్ వావిలాల సుబ్బారావు సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. బౌద్ధ స్తూపం కూల్చి ఆలయం నిర్మించారనే కోట్లాది మంది ప్రజలలో నెలకొన్న అనుమానాలకు అమరేశ్వరాలయంలోని సుమారు 38 శాసనాలను నిరంతరం అధ్యయనం చేసి గ్రంథం ద్వారా తగిన వివరణ ఇచ్చారన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పరిశోధనాత్మక వివరణ ఇచ్చి భక్తుల నమ్మకాన్ని మరింత పెంచిన వావిలాల సుబ్బారావుకు దేవదాయ శాఖ, అమరేశ్వరాలయం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త ప్రపుల్లారాణి మాట్లాడుతూ డాక్టర్ సుబ్బారావు సుమారు 38 శాసనాలను అధ్యయనం చేసిన పిదప ఈ ఆలయానికి సుమారు వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లు ప్రామాణికంగా నిరూపించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.



'అమరేశ్వరం' గ్రంథాన్ని అవిష్కరిస్తున్న వక్తలు

20 నుంచి ప్రతిరోజూ గుండె జబ్బుల ఓపీ సేవలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ గుండె జబ్బుల ఓపీ సేవలను ఈ నెల 20 నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆసుపత్రిలోని క్షయ వ్యాధి నియంత్రణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. గత రెండు నెలల నుంచి టీబీ సెంటర్‌లో గుండె జబ్బుల ఓపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. అందులో భాగంగా టీబీ సెంటర్‌ను వేరే చోటకు తరలించి ఇక్కడ గుండె జబ్బుల ఓపీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టీబీ కేంద్రాన్ని మహిళల పీజీ వసతి గృహం ఎదురుగా ఉన్న నూతన భవనంలోకి మారుస్తున్నామని తెలిపారు. గుండె జబ్బుల ఓపీ విభాగం వైద్యులకు, రోగులకు అందుబాటులో ఉండే విధంగా ఆరు గదులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. గుండె జబ్బుల ఓపీ ప్రస్తుతం పదో నంబర్ ఓపీలో ఉండేదని, వారంలో కేవలం మూడు రోజుల పని చేసేదన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. గుండె జబ్బుల వార్డులో స్కానింగ్ పరీక్షలు ఉండటం వల్ల రోగులు తిరగలేక ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని స్కానింగ్ సిబ్బంది కూడా నూతన ఓపీలో ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంటారని చెప్పారు. అందువల్ల ఈ ఓపీలో అన్ని రకాల పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గుండె జబ్బుతో బాధపడే రోగులు రోజుకు మూడు నుంచి 400 మంది వస్తుండటం వల్ల ప్రత్యేక ఓపీని కేటాయించినట్లు చెప్పారు. గుండె జబ్బుతో బాధపడే రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి మందులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.



టీబీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, వైద్యులు, వైద్య సిబ్బంది

టీబీ సెంటర్ మార్పు..

ఆసుపత్రిలోని మహిళల పీజీ వసతి గృహం ఎదురుగా నిరుపయోగంగా ఉన్న భవనాన్ని పూర్తిగా ఉపయోగంలోకి తీసుకుని వచ్చామని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. ఈ భవనంలో క్షయ నియంత్రణ కేంద్రాన్ని మారుస్తున్నామని ఆయన చెప్పారు. ఇక నుంచి ఈ భవనంలోనే పూర్తిస్థాయిలో క్షయ నియంత్రణ కేంద్రం పని చేస్తుందన్నారు. సూపరింటెండెంట్ వెంట జింకానా అధ్యక్షుడు డాక్టర్ పాదిల ప్రసాద్, డెప్యూటీ కలెక్టర్ సుధారాణి, సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్ ఉన్నారు.

డీఆర్డీఏ పీడీగా పిచ్చిరెడ్డి

బాపట్ల టౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) పీడీగా సోమవారం పిచ్చిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన కృష్ణ ఎన్నికల నిబంధనలలో భాగంగా విజయనగరం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఆర్థిక అధికారిగా పనిచేస్తున్న పిచ్చిరెడ్డిని ఇంచార్జి డీఆర్డీఏ పీడీగా ప్రభుత్వం నియమించింది.

త్రిపుర సుందరి మృతికి సీపీఎం సంతాపం

సాక్షి, అమరావతి: సీపీఎం అగ్రనాయకుడు మాకినేని బసవపున్నయ్య కోడలు త్రిపుర సుందరి మృతి పట్ల సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. మాకినేని త్రిపుర సుందరి అనారోగ్యంతో సోమవారం హైదరాబాదులో మృతి చెందారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మహిళా సంఘం నాయకురాలు డి.రమాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. త్రిపుర సుందరి వైద్యురాలిగా ప్రజా సేవ చేయడంతోపాటు జీవిత చరమాంకం వరకు కమ్యూనిస్టు అభిమానిగా ఉన్నారని పేర్కొన్నారు. రేపల్లె తాలూకా పెదపులివర్రు గ్రామంలో జన్మించిన త్రిపుర సుందరి గుంటూరు మెడికల్ కాలేజీలో డాక్టర్ చదివి గైనిక్‌లో స్పెషలైజేషన్ చేశారన్నారు. నెల్లూరు ప్రజా వైద్యశాలలో నాలుగు సంవత్సరాలు పని చేశారన్నారు. మాకినేని బసవపున్నయ్య కుమారుడు జశ్వంత్‌ను వివాహం చేసుకుని గుంటూరు సాంబశివపేటలో ప్రజావైద్యశాల ప్రారంభించారని తెలిపారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో త్రిపుర సుందరి అంత్యక్రియలు జరుగుతాయని, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు శ్రీనివాసరావు, రమాదేవి ఆ ప్రకటనలో తెలిపారు.

ఉపకారానికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో 2019 నుంచి 2022 వరకు సంవత్సరాల వారీగా ఎంపికైన విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాతో ఆధార్ నంబరును విధిగా అనుసంధానం చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎంఎంఎస్ ద్వారా ఎంపికై 9,10,11,12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు, రెన్యూవల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తమ మెరిట్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డుతో సంబంధిత బ్యాంకు వెళ్లి ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆధార్ సీడింగ్ అయిన బ్యాంకు ఖాతాలోనే డీబీటీ పద్ధతిలో ఉపకార వేతనాన్ని జమ చేస్తారని, ఆధార్ అనుసంధానం కానీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాబోవని స్పష్టం చేశారు. ఉపకార వేతన స్థితి విద్యార్థి లాగిన్ ద్వారానే తెలుస్తుందని, ఈ విషయమై తల్లిదండ్రులు, హెచ్ఎంలు, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, వైద్యులు, స్టాఫ్ నర్సుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తప్పనిసరిగా అందరూ నమోదు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని సెంటర్లపై, కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ నిలిపివేయబడతాయని వెల్లడించారు. కావున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

భార్యపై దాడి చేసిన భర్తకు తొమ్మిదేళ్ల జైలు

సత్తెనపల్లి / అమరావతి : భార్యపై దాడి చేసిన భర్తకు తొమ్మిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు అపరాధ రుసుం విధిస్తూ సెషన్స్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలం అత్తలూరుకు చెందిన కోట అర్జున్, అదే గ్రామానికి చెందిన మేరీలకు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇరువురు కుమారులు ఉన్నారు. భర్త అర్జున్ చెడు వ్యసనాలకు బానిసై భార్య మేరీని శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. దీంతో మేరీ రెండు పర్యాయాలు అమరావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పెద్దలు భార్యాభర్తల మధ్య రాజీ చేశారు. అయినప్పటికీ అర్జున్‌లో ఎలాంటి మార్పు రాకపోవడంతో మేరీ గ్రామంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. రెండేళ్ల క్రితం అర్ధరాత్రి సమయంలో మేరీ నివసిస్తున్న ఇంటి పైకి వెళ్లిన అర్జున్ ఆమె తల వెనుక భాగంలో కొట్టి గాయపరిచాడు. ఆ సమయంలో కుమారుడు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ లెక్క చేయలేదు. దీంతో తీవ్ర గాయాల పాలైన మేరీ అమరావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. సాక్షులను అమరావతి సీఐ అవ్వారు వెంకట బ్రహ్మం సకాలంలో కోర్టుకు హాజరు పరచగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి డి.నాగ వెంకటలక్ష్మి తీర్పు వెలువరించారు.

కానిస్టేబుల్ భర్తపై భార్య ఫిర్యాదు

నగరంపాలెం: భర్త వేరొకరితో ఉంటూ తమను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నికల కోడ్ దృష్ట్యా జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో సోమవారం జరగాల్సిన స్పందనను తాత్కాలికంగా రద్దు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో ఏవైనా సమస్యలు ఉన్నట్లైతే పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 86888 31568కు ఫోన్‌లోగానీ, వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చునని ముందస్తుగా ప్రకటించారు. అయితే కొల్లిపర మండలం చివలూరు గ్రామానికి చెందిన పి.ఝాన్సీ రాణి, కుటుంబ సభ్యులతో కలసి ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. డీపీఓ ఎదుట న్యాయం చేయాలి అంటూ ఫ్లెక్సీతో నిరసన వ్యక్తం చేశారు. 2016లో పోలీస్ కానిస్టేబుల్‌తో పెళ్లి జరిగిందని, ప్రస్తుతం అతను ఉత్తర సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు పిల్లలు సంతానం. కొద్దికాలంగా తాడేపల్లి అంజిరెడ్డినగర్‌కు చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకుని తమ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని పేర్కొంది. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, భర్త వద్ద ఉన్న చిన్న కొడుకుని అప్పగించి, న్యాయం చేయాలని ఆమె కోరింది.

పట్టణ ప్రణాళిక అధికారులపై దాడి

ఫిర్యాదు చేసిన అధికారులు.. కేసు నమోదు



అధికారులపై దాడికి పాల్పడుతున్న కిషోర్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తుండగా, పట్టణ ప్రణాళికా అధికారులు అడ్డుకోవడంతో భౌతికంగా దాడిచేసి, దుర్భాషలాడిన సంఘటనపై నల్లపాడు పోలీసు స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లపాడు పోలీసు స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, పట్టణ ప్రణాళిక డెప్యూటీ సిటీప్లానర్ మురళి తెలిపిన వివరాల ప్రకారం ..నగర శివారులోని గోరంట్ల మైత్రీనగర్ ఇన్నర్ రింగ్‌రోడ్డులో 50/89 లే అవుట్‌లో ఓపెన్ స్పేస్ ఉంది. అందులో గోరంట్లకు చెందిన తాళ్ల కిషోర్‌కుమార్, మరికొందరు స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారన్న సమాచారం మేరకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికా అధికారులు, ప్లానింగ్ కార్యదర్శుల బృందం అక్కడకు చేరుకున్నారు. దీంతో కిషోర్‌కుమార్ అధికారులను అడ్డుకుని, వారిపై దాడి చేసి, దుర్భాషలాడాడు. ప్రభుత్వ అధికారుల విధులను అడ్డుకున్నందుకు పట్టణ ప్రణాళికా అధికారులు కిషోర్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఆక్రమణలకు పాల్పడే వారు ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డులో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిని అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై దాడికి పాల్పడి, దుర్భాషలాడిన సంఘటనపై నగర కమిషనర్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అధికారుల విధులను అడ్డుకుని వారిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా క్షమించమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– నగర కమిషనర్ కీర్తి చేకూరి

ఓటీటీలపై నిషేధం ప్రజాస్వామ్య పరిరక్షణే

సినీ దర్శకుడు దిలీప్ రాజా

తెనాలి రూరల్: విచ్చలవిడి శృంగారాన్ని చూపిస్తున్న 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను కేంద్ర ప్రభుత్వం నిషేధించడం దేశ ఆచార సంప్రదాయాలను గౌరవించడమేనని 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. పెదరావూరులోని ఆయన స్టూడియోలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయా ఓటీటీలకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను కూడా బ్లాక్‌లో పెట్టి మితి మీరిన శృంగారాన్ని అదుపులో పెట్టి ప్రయత్నాన్ని కేంద్ర సమాచార ప్రసార శాఖ చేసిందన్నారు. దీని వలన 57 సోషల్ మీడియా ఖాతాలు, 19 వెబ్ సైట్లు, 10 యాప్‌లను భారతదేశంలో ఇక నుంచి చూడలేరని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఎన్నో పర్యాయాలు తాను కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి మురుగన్‌కు మొరపెట్టుకున్నానని ప్రసారభారతి సీఈఓకు లిఖిత పూర్వకంగా మా-ఏపీ తరఫున కోరినట్లుగా దిలీప్ రాజా తెలిపారు.

